# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో రైతు సేవా కేంద్రాలను పునర్ వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.

- వస్తు సేవల పన్ను సంస్కరణల వల్ల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

- స్థానిక సంస్థలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

- మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా విశాఖపట్నం వేదికగా భారత్ దక్షిణాఫ్రికా జట్లు ఈరోజు తలపడుతున్నాయి.

==========================

రైతులకు అన్ని రకాలైన సేవలను అందించే విధంగా రైతు సేవా కేంద్రాలను (ఆర్.ఎస్.కె.) తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ పని తీరుపై ఉన్నత స్థాయి సమీక్షను ముఖ్యమంత్రి ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు ప్రతి చిన్న అవసరానికి వేర్వేరు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని అన్నారు. అదే విధంగా భూసారంలో ఉన్న లోపాలను శాస్త్రీయంగా గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 2026 ఖరీఫ్ సీజన్ నాటికి రైతులు పెద్ద ఎత్తున సేంద్రీయ సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

==========================

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారులతో మాటా మంతి' కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు ఈ సందర్భంగా బీమా చెక్కులు అందజేశారు. ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల చొప్పున 18 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం ఉప్పాడలో నిర్వహించిన సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... పరిశ్రమలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదిలేయడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. 323 కోట్ల రూపాయలతో ఉప్పాడ తీర ప్రాంత గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉపముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసింది. ఈ నిధులలో తొలి విడతగా అన్‌టైడ్ గ్రాంట్ 410.76 కోట్ల రూపాయలు లభించాయి. ఈ నిధులతో రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లా పరిషత్‌లు, 650 మండల పరిషత్‌లు, 13,327 గ్రామ పంచాయతీలలో 13,092 అర్హత కలిగిన గ్రామ పంచాయతీలకు లబ్ది చేకూరనుంది. అన్‌టైడ్ గ్రాంట్ గా వచ్చిన నిధులను గ్రామీణ స్థానిక సంస్థలు లేదా పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చు. ఈ నిధులను జీతాలు, ఇతర పరిపాలనా వ్యయాల కోసం వినియోగించరాదు. భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ లో పేర్కొన్న 29 అంశాల పరిధిలో ఉండే గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల కోసం మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

===========================

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 2.0 సంస్కరణల వల్ల దేశంలోని ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. `సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్` పేరుతో క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలో ఆయన ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీలో పలు అంశాలపై తగ్గింపు చేసి వినియోగదారులకు ఊరట కల్పించిందని చెప్పారు. సామాన్యుల నుంచి మధ్య తరగతి వరకు ప్రయోజనం పొందేలా అన్ని రకాలైన వస్తువులపై ధరలు తగ్గించారని తెలిపారు.

===========================

యువతను పొగాకు వ్యసనం నుంచి దూరం చేయడం కోసం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా శాఖతో కలసి దేశ వ్యాప్తంగా ``పొగాకు రహిత యువజన ఉద్యమం 3.0`` పేరిట అవగాహన కార్యక్రమాలను ఈ రోజు నుంచి నిర్వహిస్తోంది. పొగాకు వినియోగం వల్ల యువత ఆరోగ్యం ఏ విధంగా దెబ్బ తింటుంది అన్నది వివరించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజం కోసం యువత కృషి చేయాలని పిలుపునిస్తోంది. దేశంలోని వివిధ విద్యాలయాలలో విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.

విరామం

===========================

రాష్ట్రంలో నకిలీ మద్యం సరఫరాను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను పటిష్టం చేయడంతో రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల పనితీరు బాగా మెరుగుపడిందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో అయిదు ప్రాంతాలలో ల్యాబ్ ల ద్వారా తనిఖీలు నిర్వహించి మద్యం నాణ్యతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నకిలీ మద్యమని తప్పుడు ప్రచారం చేసిన వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

===========================

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోషణ్ అభియాన్ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. మహిళలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి చంద్రకళ ఆకాశవాణితో ఈరోజు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలకు పౌష్టిక ఆహారాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

===========================

సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆసుపత్రులలో తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో ఆసుపత్రులలో మందుల పంపిణీ, పరిశుభ్రత, రోగ నిర్ధారణ సేవలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలపై ఆయన చర్చించారు.

===========================

విజయనగరంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో సుమారు ఒక కోటి 80 లక్షల రూపాయల నియోజకవర్గ అభివృద్ధి నిధుల (సీడీఎఫ్)తో చేపట్టనున్న పునర్ నిర్మాణ పనులకు ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి, లోక్ సభసభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

===========================

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్టణం వేదికగా భారత్ దక్షిణ ఆఫ్రికా జట్ల మధ్య ఈరోజు క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన దక్షిణ ఆఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 24 ఓవర్లు పూర్తయ్యే సరికి నాలుగు వికెట్లు నష్టపోయి 100 పరుగులు చేసింది.

===========================

దక్షిణ ఒడిశా నుండి కొమోరిన్ ప్రాంతం వరకు కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================
===========================